సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 18 । మే । 2025



నిబంధనలు బేఖాతర్!

భద్రాచలంలో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకునే వారు లేరు. 8లో



పోలీస్ శాఖలో బదిలీలు

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న 179 మంది కానిస్టేబుళ్లు, 15 మంది హెడ్ కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 27°

జిల్లాలో ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించాలి



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించేందుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో అడ్మిషన్ల కోసం రూపొందించిన బ్రోచర్‌ను శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు నాణ్యమైన బోధన అందించాలన్నారు. స్కూళ్లలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీఓ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములిక పచ్చగా..

గిరిజన రైతుల కోసం 'ఇందిర గిరి జల వికాసం'

- రాష్ట్రంలోనే భద్రాచలం ఐటీడీఏకు ఎక్కువగా..
- ఐదేళ్లలో జిల్లా వ్యాప్తంగా 1.96 లక్షల ఎకరాలు లక్ష్యం
- పైలట్ ప్రాజెక్ట్‌గా చంద్రుగొండ మండలం ఎంపిక



రాయికంపాడులో ఏర్పాటు చేసిన సోలార్ పంప్‌సెట్ వద్ద ఉద్యోగి

భద్రాచలం: గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను సారవంతం చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. పోడు భూములకు విద్యుత్ సరఫరా లేక, అటవీ శాఖ అనుమతులు రాక తీవ్రంగా ఇబ్బంది పడుతున్న గిరిజనులకు 'సార నీరు' అందించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. రాష్ట్రంలో పట్టాలు కలిగిన పోడు భూముల హక్కుదారులకు 'ఇందిర గిరి జల వికాసం' పేరిట కొత్త పథకాన్ని చేపట్టగా సీఎం రేవంత్ రెడ్డి సోమవారం నాగర్ కర్నూల్ జిల్లాలో అధికారికంగా ప్రారంభించనున్నారు. పైలట్ ప్రాజెక్టుగా భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాలను ఎంపిక చేశారు. అయితే రాష్ట్రం మొత్తం మీద ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉన్న భద్రాచలం ఐటీడీఏకే అత్యధిక నిధులు కేటాయించడంతో జిల్లాలోని అనేక మంది గిరిజనులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

పోడు భూములు సాగులోకి తెచ్చేందుకే..

భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అనేక ఏళ్లుగా పోడు భూముల ఆధారంగానే ఎంతోమంది గిరిజనులు జీవిస్తున్నారు. వీరికి దివంగత నేత వైఎస్సార్ హయాంలో హక్కు పత్రాలు అందజేశారు. ఆ తర్వాత కూడా కొంతమందికి హక్కు పత్రాలు అందాయి. అయితే ఈ భూములకు సాగు నీరు లేక గిరిజన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి ఉచిత విద్యుత్ అందజేయాలంటే ఆర్థిక భారంతో పాటు అటవీ శాఖ క్లియరెన్స్ ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సోలార్ విద్యుత్ ద్వారా పంప్‌సెట్లను అందించాలని నిర్ణయించింది. తద్వారా వచ్చే ఐదేళ్లలో పోడు సాగుదారులందరికీ సోలార్ పంప్ సెట్లకు రూ.6 లక్షల చొప్పున నిధులు విడుదల చేయనుంది.

రానున్న ఐదేళ్లలో జిల్లాకు కేటాయింపులు ఇలా..

సంవత్సరం	రైతులు	పోడు ఎకరాలు
2025 - 26	2,921	8,046
2026 - 27	14,856	46,988
2027 - 28	14,856	46,988
2028 - 29	14,856	46,988
2029 - 30	14,856	46,988
మొత్తం	62,347	1,96,000

పథకం అమలు ఇలా..

ఈ పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించింది. రెండున్నర ఎకరాల పొలం ఉన్న రైతును సింగిల్ యూనిట్‌గా గుర్తించింది. అంతకంటే తక్కువగా ఉన్న రైతులను గ్రూప్‌గా ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ఈనెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించి రైతులను గుర్తించాలి. జిల్లా స్థాయిలో ఈనెల 30 నాటికి సర్వే, ఇతర పనుల టెండర్లు ఖరారు చేసి, జూన్ 25 నాటికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనులు ప్రారంభించేలా షెడ్యూల్ ప్రకటించారు. జూన్ 26 నుంచి మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరు బావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు, ఇతర పనులు పూర్తి చేయాలి. జిల్లా స్థాయిలో పథకం అమలుకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

భద్రాచలం ఐటీడీఏకు భారీగా..

రాష్ట్రంలో 2025 - 26 నుంచి 2029 - 30 వరకు ఆరు లక్షల ఎకరాలను జల వికాసం పథకంలోకి తీసుకురానున్నారు. అందులో జిల్లాలోనే అత్యధికంగా 1.96 లక్షల ఎకరాల భూమి సాగులోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించడం విశేషం. కాగా, ఈ పథకానికి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చంద్రుగొండ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇప్పటికే బెండాలపాడు, రాయికంపాడు తదితర గ్రామాల్లో సోలార్ పంప్‌సెట్లు అమర్చి ట్రయల్ రన్ నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో ఈ పథకం ప్రారంభమయ్యాక జిల్లాలో మొదలు పెట్టనున్నారు.

గిరిజన పోడు రైతులకు పూర్తి సబ్సిడీ



పోడు హక్కు పత్రాలున్న భూముల్లో సాగు చేస్తున్న గిరిజన రైతులకు పూర్తి సబ్సిడీతో ఈ పథకం అమలు జరగనుంది. ప్రభుత్వం ఇప్పటికే విధి విధానాలు ప్రకటించింది. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టుగా చంద్రుగొండ మండలంలో ట్రయల్ రన్ నిర్వహించాం.

– డేవిడ్ రాజ్, ఐటీడీఏ ఏపీఓ జనరల్

జిల్లా.. సహజ వనరుల ఖిల్లా

- ప్రజాస్వామ్యానికి ప్రతీకగా భద్రాద్రి.
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



కిన్నెరసాని బ్రిడ్జిని ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క, పక్కన మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ పాటిల్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సహజ వనరులకు నిలయంగా జిల్లా నిలుస్తోందని, రాజకీయ భావజాలంతో ప్రజాస్వామ్యానికి ప్రతీకగా గుర్తింపు పొందిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఐడీఓసీ, పాల్వంచ శ్రీనివాసకాలనీ, పాండురంగాపురంలో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎస్ఈ, డీఈ కార్యాలయాల నిర్మాణాలకు శనివారం కలెక్టరేట్‌లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరిక మేరకు కేటీపీఎస్‌లో నూతన విద్యుత్ స్టేషన్ నిర్మాణానికి అన్ని రకాలా అధ్యయనం చేసి 15 రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. గోదావరిపై నుంచి నౌకాయానానికి అవకాశాలను పరిశీలిస్తామని, తద్వారా రవాణా వ్యయం తగ్గుతుందని అన్నారు. నిరుద్యోగ యువత కోసం రూ.900 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన జిల్లా అయినా దేశానికి విద్యుత్ వెలుగులు నింపిన చరిత్ర ఉందన్నారు. సీతారామ ప్రాజెక్ట్‌తో జిల్లా సస్యశ్యామలం అవుతుందని, భద్రాద్రి రామయ్య చుట్టూ జాతీయ రహదారులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జలగం వెంగళరావు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేశారని, అలాంటి అవకాశం ఇప్పుడు భట్టి విక్రమార్కకు వచ్చిందని అన్నారు. నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం భట్టి తదితరులు కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించి వ్యాపారం ఎలా సాగుతోందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

కిన్నెరసాని బ్రిడ్జి ప్రారంభం..

పాల్వంచరూరల్ : రాజాపురం–యానంబైల్ మధ్య కిన్నెరసాని వాగుపై నిర్మించిన బ్రిడ్జిని మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఆతర్వాత బూడిద వాగుపై బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అటవీ అభివృద్ధి, గిడ్డంగుల సంస్థల చైర్మన్‌లు పొదెం వీరయ్య, రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, ఆర్‌అండ్‌బీ ఈఈ వి.వెంకటేశ్వర్లు, డీఈ ఐ.నాగేశ్వరరావు, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు ఎడవల్లి కృష్ణ, యర్రంశెట్టి ముత్తయ్య, సాబిర్‌పాషా, విశ్వనాదం, పూర్ణచందర్‌రావు, మధు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, సోములగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రంపై దృష్టి పెట్టాలని స్థానిక రైతులు మంత్రి తుమ్మలను కోరారు.

ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలి

సింగరేణి(కొత్తగూడెం): వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు వెలికి తీసేలా చూడాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. శనివారం ఆయన స్థానిక ప్రధాన కార్యాలయం నుంచి అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భారీ వర్షాలతో ఓసీ క్వారీల్లో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడకుండా ముందే సంపుల్లోని నీటిని తొలగించాలని, ఇందుకు అవసరమైన మోటార్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గనుల వారీగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, కె.వెంకటేశ్వర్లు, సుభానీ, సి.పి.పి మనోహర్, మార్కెటింగ్ జీఎం ఎస్.వి రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్టు తనిఖీ



టీషర్టును పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ కృష్ణమాచారి

పాల్వంచరూరల్: యానంబైల్ రేంజ్ కిన్నెరసానిలోని వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్టులో ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ కృష్ణమాచారి శనివారం తనిఖీ చేశారు. పర్యాటకులకు విక్రయించే టోపీలు, టీషర్టులను పరిశీలించారు. అనంతరం మొండికట్ట బీట్‌లో ఫారెస్ట్ ప్లాంటేషన్‌ను సందర్శించారు. వైల్డ్‌లైఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీర్ పార్కు వద్ద రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఖాళీగా ఉన్న మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ (ఇంటర్నల్), ఈ–2 గ్రేడ్ 30 పోస్టులకు, జూనియర్ ఆఫీసర్ ఈ–గ్రేడ్–1 రెండు పోస్టులకు ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్నట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సంస్థలో పనిచేసే ఉద్యోగులతోనే ఈ పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొంది. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో నేడు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపింది.

సూపర్‌బజార్ ఎండీగా మురళీధర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సూపర్ బజార్ ఎండీగా ఎ.జె.మురళీధర్‌ను నియమిస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఎండీ నికోలస్‌ను రిక్రూట్‌మెంట్ సెల్ జీఎంగా నియమించగా, ఆ స్థానంలో ఈఈ సెల్ హెచ్‌ఓడీగా ఉన్న మురళీధర్‌కు అవకాశం కల్పించారు.

కాంటాల జాప్యంపై రైతు ఆగ్రహం



రహదారిపై ధాన్యం బస్తాలు వేసిన రైతు హన్మంతరావు

నేలకొండపల్లి: ధాన్యం కాంటాల్లో జాప్యం జరుగుతుండడంతో ఓ రైతు రోడ్డుపై ధాన్యం పోసి నిప్పంటించేందుకు యత్నించాడు. మండల కేంద్రంలోని మార్కెట్‌లో ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ కేంద్రానికి 50 రోజుల కిందట తాతా హనుమంతరావు ధాన్యం తీసుకొచ్చాడు. ఇప్పటివరకు కాంటా వేయకపోగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తుండడంతో శనివారం ఆయన బోదులబండ – నేలకొండపల్లి రహదారిపై ధాన్యం బస్తాలను వేసి నిప్పంటించేందుకు యత్నించాడు. దీంతో సహచర రైతులు అడ్డుకోగా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు చేరుకుని నచ్చజెప్పారు. త్వరగా కాంటా వేయిస్తామని నిర్వాహకులు చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.

విధి నిర్వహణలో ఐటీసీ కార్మికుడికి గుండెపోటు

చికిత్స పొందుతూ మృతి



షంషుద్దీన్ (ఫైల్)

బూర్గంపాడు: సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలో విధులు నిర్వహిస్తున్న పర్మనెంట్ కార్మికుడు శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. బూర్గంపాడుకు చెందిన ఎండీ షంషుద్దీన్(40) శనివారం ఉదయం విధులకు హాజరై గుండెపోటుతో అస్వస్థతకు గురయ్యాడు. అతనిని చికిత్స నిమిత్తం ఐటీసీ డిస్పెన్సరీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు సందర్శించి నివాళులర్పించారు. విధులకు వెళ్లిన భర్త విగతజీవిగా ఇంటికి చేరటంతో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు గుండెలావిసేలా రోదిస్తున్నారు. క్రీడాకారుడిగా గుర్తింపు సాధించిన షంషుద్దీన్ మృతితో బూర్గంపాడులో విషాదం అలుముకుంది. స్థానికంగా క్రికెట్ టోర్నమెంట్‌ల నిర్వహణలో ఆయన కీలకంగా పనిచేసేవారు. మృతిపట్ల మిత్రులు, క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

పోలీస్ శాఖలో బదిలీలు

దుమ్ముగూడెం: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 179 మంది కానిస్టేబుళ్లు, 15 మంది హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ రోహిత్‌రాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా స్టేషన్లలో వారు విధులు నిర్వహించబట్టి సుదీర్ఘకాలం అయినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దుమ్ముగూడెం స్టేషన్‌లో ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

నిబంధనలు బేఖాతర్!

- భద్రాచలంలో అక్రమంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు
- నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు



భద్రాచలంలోని సూపర్‌బజార్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు కడుతున్నారు. వంద, రెండొందల గజాల్లో రెండు, మూడు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. నోటీసులు ఇచ్చేందుకు కూడా జాప్యం చేస్తున్నారు. మొదటి అంతస్తు నిర్మాణంలో ఉన్నప్పుడు ఫిర్యాదు అందితే మూడు అంతస్తు నిర్మించేటప్పుడు స్పందిస్తున్నారు. పాఠశాల, షాపింగ్ కాంప్లెక్సుల భవనాలు కూడా అనుమతి లేకుండా నిర్మిస్తున్నారు.

జీ+2 వరకే అనుమతి..

భద్రాచలంలోని 19 వార్డుల్లో 36 వేల కుటుంబాలు ఉన్నాయి. 80 వేల మంది జనాభా నివసిస్తున్నారు. దక్షిణ భారత అయోధ్యగా పేరొందిన ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో క్రమంగా ఇళ్ల నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల 36 ఇళ్ల నిర్మాణానికి గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన వారు అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు సాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ నిబంధనల మేరకు పట్టణంలో 300 చ.మీలోపు జీ+2 అంతస్తుల వరకే ఇళ్ల నిర్మాణాలకే అనుమతి ఉంది. కానీ పలువురు జీ+3, జీ+4, జీ+5 వరకు నిర్మిస్తున్నారు.అధికారులు యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో యజమానులు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇరుకు వీధుల్లోనూకనీసం దారి లేకుండా నిర్మిస్తున్నారు. రామాలయ పరిసర ప్రాంతాల్లో అక్రమనిర్మాణాలు అంతస్తులు దాటిపోతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

అక్రమంగా నిర్మించినవి 130.. నోటీసులు ఇచ్చినవి 11

ఇప్పటివరకు అక్రమ కట్టడాలపై రూ.30లక్షల వరకు జరిమానా విధించి వసూలు చేసినట్లు సమాచారం. పట్టణంలో ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించి 130 ఇళ్లు నిర్మించినట్లు అధికారిక సర్వేలో తేలగా, వీటిల్లో కేవలం 11ఇళ్లకే నోటీసులు ఇచ్చారు. కొన్నేళ్ల క్రితం శ్రీపాద శ్రీపతి అనే వ్యక్తి పురాతన ఇంటిపై నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించాడు. గ్రామ పంచాయతీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా నిర్మాణం కొనసాగించాడు. ఈ క్రమంలో గత మార్చి 26న నిర్మాణంలో ఉన్న సదరు భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు శిథిలాల మధ్య చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. అధికారులు చిత్తశుద్ధితో నిర్మాణాలను నిలిపివేయిస్తే ఇద్దరి ప్రాణాలు నిలిచేవి. పట్టణంలో సూపర్‌బజార్‌కు చెందిన ఓ వ్యక్తి జీ+2 నిర్మాణానికి అనుమతి పొంది జీ+3 నిర్మాణం చేపట్టాడు. అదే కాలనీకి చెందిన మరో వ్యక్తి జీ+2 ఇంటి నిర్మాణానికి అనుమతి పొంది జీ+4 నిర్మాణం చేపట్టాడు. వీరిద్దరికీ అధికారులు మూడుసార్లు నోటీసులు అందజేశారు. అధికారులు అంతకుమించి ముందడుగు వేయకపోవడంతో యజమానులు కూడా ఖాతరు చేయడంలేదు.

అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలు



గ్రామపంచాయతీ అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. జీ+2కు మించి చేపట్టిన అక్రమ కట్టడాలను గుర్తిస్తాం. ఇప్పటికే నోటీసులు అందుకున్నవారిపై చర్యలకు ఉపక్రమిస్తాం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే ఉపేక్షించం.

– శ్రీనివాసరావు,
గ్రామ పంచాయతీ అధికారి, భద్రాచలం

పత్తి కాంటాల్లో మోసం

26 మంది చిరు వ్యాపారులు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్ తదితరులు

సుజాతనగర్: పత్తి కాంటాల్లో మోసానికి పాల్పడుతున్న చిరు వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కే అబ్దుల్ రెహమాన్ వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. సుజాతనగర్ మండలంలోని సర్వారం, జూలూరుపాడు మండలంలోని కొమ్ముగూడెం, చుంచుపల్లికి చెందిన పలువురు చిరు వ్యాపారులు తమ ట్రాలీ వాహనాల్లో గ్రామాల్లో తిరుగుతూ పత్తి కొనుగోలు చేస్తున్నారు. వీరు జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన పత్తి వ్యాపారులు కేశపూర్ణ వెంకట కృష్ణారావు, సుజాతనగర్ మండలం కోమటపల్లి గ్రామానికి చెందిన మూడు భీమ్లాలకు విక్రయిస్తున్నారు. అయితే మార్కెట్‌లో గుమస్తాగా పనిచేసే భూక్యా అర్జున్, ధర్మ కాంటా వే బ్రిడ్జి ఆపరేటర్లు గోతం సతీష్, అక్కినపల్లి రాజేష్‌లతో చిరువ్యాపారులు చేతులు కలిపి తెచ్చిన పత్తి కంటే అదనంగా వే బిల్లులు చూపిస్తూ వ్యాపారుల నుంచి నగదు తీసుకుంటున్నారు. మూడు, నాలుగు నెలలుగా ఈ దందా సాగుతోంది. క్రమంగా నష్టం వస్తుండటంతో గమనించిన వ్యాపారులు వెంకట కృష్ణారావు, భీమ్లాలు ఈ నెల 8న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టగా 268.95 క్వింటాళ్ల పత్తిని అదనంగా చూపించి చిరువ్యాపారులు, ఆపరేటర్లు సుమారు రూ. 17 లక్షలను కాజేసినట్లు తేలింది. ఈ ఘటనలో 26 మంది చిరువ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. 18 ట్రాలీ వాహనాలు సీజ్ చేయడంతో పాటు రూ.13.18 లక్షలను రికవరీ చేశారు. కాగా వే బ్రిడ్జి ఆపరేటర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఎం.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలను సందర్శించిన డీలర్ల బృందం



వర్మీ కంపోస్టు యూనిట్‌ను పరిశీలిస్తున్న డీలర్లు

అశ్వారావుపేటరూరల్: శ్రీ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలను శనివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన దేశి డీలర్ల బృందం సందర్శించింది. ఎరువులు, పురుగు మందులషాపుల యజమానులకు 45 రోజుల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ (దేశి) కోర్సు నిర్వహిస్తున్నారు. శిక్షణలో డీలర్లు కళాశాలను సందర్శించారు. కళాశాలలోని వివిధ రకాల కూరగాయల పంటలతోపాటు మునగ, మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ పంటల యాజమాన్యం, సాగు పద్ధతులు, వర్మీ కంపోస్టు, తేనెటీగల పెంపకంపై శాస్త్రవేత్తలు వారికి వివరించారు. కళాశాలలో నూతనంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ మోడల్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ నీలిమ, డాక్టర్ ఎస్.చరిత, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

‘సీతారామ’ పనుల్లో భారీగా అవినీతి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



పిల్లర్ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో అవినీతి వరద ప్రవహిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని 48.30 కి.మీ. వద్ద ప్రధాన కాలువపై సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిన ప్రదేశాన్ని శనివారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.20వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్ట్ ట్రయల్ రన్‌కే పిల్లర్ కూలిపోవడం పనుల్లోని డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తున్నాయని అన్నారు. ప్రధాన కాలువ గైడ్‌వాల్‌కు పలుచోట్ల బీటలువారడం, లైనింగ్ విరిగిపోయి ప్రధాన కాలువ తెగిపోవడం అధికారుల ఉదాసీనత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని అన్నారు. సమగ్ర విచారణ చేపట్టి అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల అధ్యక్షులు గుగులోత్ శంకర్‌నాయక్, జుబ్బూరి రమేష్, తంగెళ్ల ఆంజనేయులు, బాణోత్ మల్లేష్, బాణోతు సుధారాణి, తేజావత్ పార్వతి, సూర్యం, రవికుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిగూడెం, అబ్బుగూడెం గ్రామాల్లో శనివారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కాంటాలు అయినా ఎగుమతి లేక, లారీలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిస్థితి చూడాలని పేర్కొన్నారు. ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన మామిడి రెమల్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జుబ్బూరి రమేష్, దేవిబాల కిరణ్‌శర్మ, జటంగి కృష్ణ, మొగిలి రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల్లో జేసీబీ బోల్తా



ధ్వంసమైన జేసీబీ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామ శివారు పట్టా భూమిలో అనధికారికంగా చేపట్టిన మట్టి తవ్వకం పనుల్లో శనివారం జేసీబీ బోల్తా పడింది. కొమరారం గ్రామానికి చెందిన పాషతన సొంత పొలంలో చేపల పెంపకం పేరుతో సుమారు రెండు గుంటల విస్తీర్ణంలో మొరం తవ్వకం ప్రారంభించాడు. మట్టి తవ్వకాలు మరీ లోతుగా ఉండటం కారణంగా జేసీబీ తవ్వకం పనుల కోసం లోనికి దిగుతుండగా అదుపు తప్పి పల్టీకొట్టింది. డ్రైవర్ ప్రమాదాన్ని ముందే గుర్తించి దూకడం ద్వారా క్షేమంగా బయటపడ్డాడు. ప్రమాదంలో జేసీబీ కొంత మేర ధ్వంసమైంది.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న మత్స్యశాఖ అధికారి

కూసుమంచి: పాలేరులోని పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో పది జిల్లాల మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ‘జలాశయాల్లో మత్స్య అభివృద్ధి – యాజమాన్య పద్ధతులు’ అనే అంశంపై ఇచ్చిన శిక్షణకు ఖమ్మం, నిజామాబాద్, హనుమకొండ, సూర్యాపేట, కామారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సిరిసిల్ల జిల్లాల మత్స్యకారులు పాల్గొన్నారు. కాగా, ముగింపు సమావేశంలో సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నాగులునాయక్ మాట్లాడుతూ.. శిక్షణను మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని మత్స్య అభివృద్ధి సాధించాలని, తద్వారా రాష్ట్రాన్ని ఆక్వా హబ్‌గా మార్చాలని సూచించారు. చేపల పెంపకంతో పాటు మార్కెటింగ్ కూడా కీలకమైనందున మెళకువలు నేర్చుకోవాలని పేర్కొన్నారు. మత్స్యపరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్‌తో పాటు శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్, నాగరాజు మాట్లాడగా శిక్షణలో పాల్గొన్న వారికి నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశారు.

ఇసుక లారీ సీజ్

పాల్వంచరూరల్: మండల పరిధిలోని నాగారం నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న ఇసుక లారీని పోలీసులు పాల్వంచలోని దమ్మపేట సెంటర్‌లో శనివారం రాత్రి పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు, ఆధారాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

విద్యావ్యవస్థ సమర్థవంతంగా కొనసాగాలి

సైట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి



మాట్లాడుతున్న సైట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి

ఖమ్మంసహకారనగర్: విద్యావ్యవస్థను సమర్థవంతంగా కొనసాగేలా అందరూ కృషి చేయాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ (సైట్) డైరెక్టర్ విజయలక్ష్మీబాయి సూచించారు. ఖమ్మంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎంఈఓలు వారి పరిధి పాఠశాలల్లో బోధన నాణ్యత పెంచేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతీనెల ఉపాధ్యాయుల సమీక్షలు నిర్వహించి, ప్రణాళికపై సూచనలు చేయాలని తెలిపారు. ఆ తర్వాత బడిబాట, పాఠ్యపుస్తకాల సరఫరా, ఏకరూప దుస్తులు సిద్ధం చేయడంపై సూచనలు చేసిన ఆమె శిక్షణలో ప్రతిభ కబబర్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రాజశేఖర్, ఎంఈఓలు పాల్గొన్నారు. కాగా, పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి చేయడమే కాక విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సమకూర్చాలని, అన్ని పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు సైట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు యాదగిరి, ఎస్‌కే మన్సూర్, నాయకులు పోతగాని వెంకన్న, పాశం శ్రీనివాస్, రామకృష్ణ, రాజు, పెనుగొండ ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీచర్ మృతి



నగేష్(ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని మొహల్లా నెంబర్–16 ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు బి. నగేష్(45) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాధ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన నగేష్ ఐదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. మృతి పట్ల టీఎస్ యూటీఎఫ్, ఏటీఎఫ్, టీపీటీఎస్, పీఆర్‌టీయూ సంఘాల నాయకులు రాంబాబు, వెంకటేశ్వర్లు, కబ్బాకుల రవి, మోకాళ్ల శ్రీనివాస్, వెంకట్రాం, సర్వేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్..

పాల్వంచరూరల్: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతానగర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ గుగులోత్ సాయిమహేందర్‌నాయక్(33) గత నెల 21న ఇంటి వద్ద పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా, కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఈ నెల 14న భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఎస్సెస్సీ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

మొదటి ఐదుగురికి విమానయానం కూడా..




విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులకు మిత్రా ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ.3 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బహుమతులు అందజేసి అభినందించారు. మొదటి బహుమతి రూ.25 వేలతో పాటు ల్యాప్‌టాప్‌ను పచావ వెన్నెల, మాఘం యశ్వంత్ రూ.25 వేలు, చింతోజు సాయి రూ.15 వేలు అందుకోగా, తిరుమలదాసు మాధురి, రామిశెట్టి ఉమ, ఆవుల శ్రీమన్య, గోద లక్ష్మి, పుచ్చకాయల భవ్య, చందా భావనకు రూ.10 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన ఐదుగురు విద్యార్థులను ఢిల్లీకి విమానంలో మూడు రోజుల యాత్రకు తీసుకెళ్తామని తెలిపారు. మిత్ర ఫౌండేషన్ డైరెక్టర్లు రంగా శ్రీనివాస్, పోలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్, చెరుకూరి యుగంధర్, నాగసాయి నగేశ్, ప్రెసేన్, ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

- మరొకరికి తీవ్ర గాయాలు



రామ్మూర్తి మృతదేహం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ అశోక్‌నగర్ సమీపంలో శనివా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. మా మిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట గ్రామానికి చెందిన తెల్లం రామ్మూర్తి (35), చింత రవి భవన నిర్మాణ పనులు చేసేందుకు బైక్‌పై మసివాగు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో అశోక్‌నగర్ మూలమలుపు వద్ద బైక్‌ను చెట్టును ఢీకొనడంతో తీవ్ర గాయాలై రామ్మూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. చింత రవికి కూడా తీవ్రంగా గాయాలు కావడంతో 108 వాహనంలో ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం సిఫారసు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. మృతుడు రామ్మూర్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్

సుజాతనగర్: మండలంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం రెండు షిఫ్ట్‌ల్లో పరీక్ష నిర్వహించనుండగా, మొత్తం 120 మంది పరీక్షలు రాయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్ జరగనుంది. పరీక్షకు గంటన్నర ముందునుంచే కేంద్రంలోకి అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఐదు పశువులు మృతి



మృతి చెందిన పశువులు

జూలూరుపాడు: విద్యుదాఘాతంతో ఐదు పశువులు మృత్యువాత పడ్డాయి. రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలంలోని సురారం గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. శనివారం ఉదయం మేతకు వెళ్లిన రెండు దుక్కిటెద్దులు, మూడు పాడి పశువులు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. సుమారు రూ. 3 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత, సురారానికి చెందిన రైతులు బానోత్ వెంకటేశ్వర్లు, ఉడుతల వెంకన్న, తేజావత్ సూర్య, మందెరకల నాగేశ్వరరావు, జూలూరి లక్ష్మి వాపోయారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. విద్యుత్ ఏఈ సతీష్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామని ఏఈ తెలిపారు. అనంతరం జూలూరుపాడు పశువైద్యాధికారి సాయిరాం సందీప్ మృత్యువాతకు గురైన పశువులకు పోస్ట్‌మార్టం నిర్వహించారు.